క్లుప్తంగా

దివ్యాంగురాలికి ఆర్థికసాయం



ఆర్థికసాయం చేస్తున్న శివకుమార్

చింతలమానెపల్లి: మండలంలోని రుద్రాపూర్ గ్రామానికి చెందిన దివ్యాంగురాలు లెండుగురె లక్ష్మికి ఎక్స్ ఆర్మీ అసోసియేషన్ అధ్యక్షుడు శివ కుమార్ రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులు అందజేశాడు. లక్ష్మి గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా.. స్థానికుల ద్వారా విషయం తెలుసుకొని ఆర్థిక సాయం చేశారు. ఆయన వెంట సిస్టర్ కుసుమ, పంచాయతీ కార్యదర్శి కైలాస్, తదితరులు ఉన్నారు.

3న ఆలయ భూములు కౌలు వేలం

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీకేశవ నాథస్వామి ఆలయ భూములు జన్కాపూర్ శివారులోని సర్వే నం. 85లోని 13 ఎకరాల 21 గుంటల భూమిని సంవత్సర కాలం పాటు కౌలు నిమిత్తం జూన్ 3న పట్టణంలోని శ్రీ కేశవ నాథస్వామి ఆలయం ఆవరణలో బహిరంగ వేలం వేయనున్నట్లు దేవాదాయశాఖ ఈవో వేణుగోపాల్‌గుప్తా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఆధార్ కార్డు జిరాక్స్, పాస్ ఫొటోతో పాటు ధరావత్తు సొమ్ము రూ. 50వేల నగదు ముందుగానే చెల్లించాల్సి ఉంటుందన్నారు. వేలం పాట ముగిసిన వెంటనే నగదు ఆలయానికి చెల్లించి రశీదు తీసుకోవాలని సూచించారు. రూ. 100 నాన్ జ్యుడిషియల్ స్టాంప్ పేపర్‌పై అగ్రిమెంట్ చేసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్అర్బన్: ఆసిఫాబాద్ టౌన్-2లోని 11కెవీ లైన్ మరమ్మతుల కారణంగా గురువారం జిల్లా కేంద్రంలోని కుమురం భీంచౌక్ నుంచి జైలు వరకు, కోర్టు ప్రాంతంలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సదాశివ్ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

సర్వసభ్య సమావేశం వాయిదా



వాయిదా వేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఎంపీడీవో ప్రసాద్

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి సర్వసభ్య సమావేశం బుధవారం వాయిదా పడింది. మండల పరిషత్ కార్యాలయానికి ఎంపీపీ దుర్గం నానయ్య, ఎంపీడీవో కోట ప్రసాద్‌లు హాజరు కాగా, సభ్యులు హాజరుకాలేదు. కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. తిరిగి సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామన్నారు.

వానాకాలం సాగుకు సమాయత్తం కావాలి

బెల్లంపల్లి: వానాకాలం పంటల సాగుకు రైతులు సమాయత్తం కావాలని బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కోట శివకృష్ణ సూచించారు. బుధవారం కేవీకే ప్రాంగణంలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందస్తుగా రైతులు వేసవి దుక్కులు దున్నుకుని సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. శుద్ధిచేసిన నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. సమగ్ర పోషక, చీడపీడల యాజమాన్యంపై రైతులకు అవగాహన కలిపించారు. కూర గాయల సాగు పద్ధతులను కేవీకే శాస్త్రవేత్త స్రవంతి వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ నార్మ్ బోర్డు సభ్యుడు గోనె హన్మంతరావు , కేవీకే శాస్త్రవేత్తలు తిరుపతి, నాగరాజు, ఎఫ్‌పీసీ సభ్యులు శంకర్, శ్రీనివాసరావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

'బీసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి'

నెన్నెల: మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన హామీలను దశల వారీగా నెరవేర్చాలని కోరుతూ బీసీ ఐక్య వేదిక జిల్లా అధ్యక్షుడు వడ్డెపల్లి మనోహర్ బుధవారం తహసీల్దార్ రమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే బీసీ జనగణన చేస్తామని, జనాభాకు అనుగుణంగా బీసీ రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతానికి రిజర్వేషన్లు పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దండె భూమన్న, ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు ఓదెలు, జనార్దన్‌గౌడ్, రాజన్న, తిరుపతి, అరుణ్‌సింగ్, వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.



కంకర వేసి వదిలేసిన రాంపూర్ రోడ్డు

కంకర వేశారు.. తారు మరిచారు

- 7.5 కోట్లతో బీటీరోడ్డు మంజూరు
- నత్తనడకన సాగుతున్న పనులు

రెబ్బెన: దేవుడు వరమిచ్చిన పూజారి వరమివ్వడు అన్న చందంగా మారింది మండలంలోని పలు గ్రామాల రోడ్ల పరిస్థితి. ఏళ్ల తరబడి మట్టిరోడ్లపై అవస్థలు పడిన ప్రజలకు గత ప్రభుత్వం తీపి కబురు అందించింది. మట్టిరోడ్ల స్థానంలో బీటీ రోడ్లు మంజూరు చేస్తూ నిధులు కేటాయించింది. అధికారులు సైతం మంజూరైన రోడ్డు పనులు చేపట్టేందుకు టెండర్లకు ప్రక్రియను పూర్తి చేసి పనులను కాంట్రాక్టర్లకు అప్పగించారు. దీంతో కొన్ని నెలల్లోనే తమ గ్రామాలకు బీటీ రోడ్డు అవుతుందని సంబురపడిన ప్రజలకు నెలలు గడుస్తున్నా రోడ్డు నిర్మాణం పూర్తి కాలేదు. మరికొన్ని రోజుల్లో వర్షాలు ప్రారంభం కానున్నాయి. మళ్లీ బురద రోడ్డుతో సహవాసం తప్పదా అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆగుతూ... సాగుతూ..

గత ప్రభుత్వం గిరిజన సంక్షేమ ద్వారా గిరిజన ఆవాస ప్రాంతాలకు మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో నిధులు కేటాయించింది. మొదటి విడుతలో మండలానికి రూ. 3.96 కోట్లతో నాలుగు గ్రామాలకు బీటీరోడ్లు మంజూరు చేసింది. పులికుంట పంచాయతీ పరిధిలోని తక్కళ్లపల్లి రైల్వే గేట్ సమీపంలోని ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి కొత్తపులికుంట వరకు 2కిలోమీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.16 కోట్లు, నారాయణపూర్ పరిధిలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి పైకాజీగూడ వరకు 1.2 కిలోమీటర్ల రోడ్డు కోసం రూ. 1.05 కోట్లు, రాంపూర్ పరిధిలో పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి రాంపూర్ వరకు 2కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 1.40 కోట్లు, రోళ్లపాడు పంచాయతీలో ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి 1.2 కిమీ మేర రోడ్డు నిర్మాణానికి రూ. కోటి రూపాయాలను ప్రభుత్వం మంజూరు చేసింది. రెండో విడతలో పైకాజీగూడకు 3కిలోమీటర్ల బీటీ రోడ్డుతో పాటు రోడ్డు మధ్యలో ఉన్న బ్రిడ్జి నిర్మాణం కోసం మరో రూ. 3.6 కోట్లు మంజూరు చేసింది. సంవత్సరంలోపు పనులు పూర్తి చేయాల్సి ఉన్నా.. ఇంకా కొనసాగుతునే ఉన్నాయి.

వర్షాకాలం లోపు కష్టమే..

ఎట్టకేలకు ప్రభుత్వం బీటీరోడ్లు మంజూరు చేసినా.. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగడం లేదు. పైకాజీగూడ, రోళ్లపాడు రోడ్ల పనులు మెటీరియల్స్ సమకూర్చుకునే దశలో ఉండిపోయాయి. ఇక కొత్త పులికుంటకు మంజూరైన రోడ్డు ఊసే లేదు. రాంపూర్ గ్రామస్తులు కంకర పోసిన రోడ్డుతో అవస్థలు పడుతుండగా పైకాజీగూడ, రోళ్లపాడు, కొత్తపులికుంట గ్రామాల ప్రజలకు మట్టి రోడ్లపై ప్రయాణిస్తు.. తిప్పలు పడుతున్నారు.

ఇబ్బందులు తప్పడం లేదు



రాంపూర్ గ్రామానికి బీటీరోడ్డు మంజూరు కావడంతో ఎంతో సంబురపడ్డాం. కానీ కాంట్రాక్టర్ పనులను నెమ్మదిగా చేపడుతుండటంతో ఇబ్బంది పడుతున్నాం. కంకర పోసి నెలలు గడుస్తున్నా.. బీటీ వేయకపోవటంతో అవస్థలు పడుతున్నాం. వాహనాలు అదుపు తప్పుతున్నాయి.

– పురుషోత్తం, రాంపూర్


వెంటనే పనులు చేపట్టాలి



గత ప్రభుత్వం కృషితో గిరిజన గ్రామాలకు బీటీ రోడ్లు మంజూరయ్యాయి. ఆదివాసీ గిరిజన గ్రామమైన కొత్తపులికుంటకు సైతం బీటీ రోడ్డును మంజూరు చేశారు. అయినా.. ఇప్పటి వరకు రోడ్డు పనులు చేపట్టలేదు.

– బుర్స పోషమల్లు, మాజీ సర్పంచ్, పులికుంట

అగ్నిగుండంగా జిల్లా



- వార్నింగ్ జోన్‌లో నాలుగు మండలాలు
- కాగజ్‌నగర్‌లో 45.7 డిగ్రీలు

కౌటాల: జిల్లాలో గత వారం నుంచి ఎండలు దంచికొడుతున్నాయి. బుధవారం కాగజ్‌నగర్‌లో అత్యధికంగా 45.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా.. కౌటాలలో 45.3 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. పగలు రాత్రి అనే తేడా లేకుండా ప్రజలు ఉక్కిరిబిక్కిరివుతున్నారు. ఉదయం పది దాటితే ఇంట్లో నుంచి బయటకు రావడం లేదు. వాహనాదారులు, చిరువ్యాపారులు వడగాలులకు అల్లాడుతున్నారు. కాగజ్‌నగర్, కౌటాల, ఆసిఫాబాద్, సిర్పూర్(టి) మండలంలో వార్నింగ్ జోన్‌లో ఉండగా.. మిగతా 11 మండలాలు అలర్ట్ జోన్‌లో ఉన్నాయి.

జిల్లాలో బుధవారం నమోదైన ఉష్ణోగ్రతలు

ప్రాంతం	గరిష్టం
కాగజ్‌నగర్	45.7
కౌటాల	45.3
ఆసిఫాబాద్	45.2
సిర్పూర్(టి)	45.1
తిర్యాణి	44.7
ఎల్కపల్లి	44.6
జంబుగా	44.5
వాంకిడి	44.5
వంకులం	44.4

గడువులోగా యూనిఫాం అందించాలి



కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

- అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్‌రూరల్: నిర్దేశిత గడువులోగా విద్యార్థులకు యూనిఫాంలు అందించాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. కాగజ్‌నగర్ మండలం నజ్రూల్‌నగర్‌లో విద్యార్థుల యూనిఫాంలు కుట్టేందుకు ఏర్పాటు చేసిన మహిళా శక్తి కుట్టు కేంద్రాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన విద్యా సంవత్సరం జూన్ 12న ప్రారంభమవుతుందని, జూన్ 5లోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించాలని ఆదేశించారు. యూనిఫాంలు తయారు చేసేందుకు జిల్లాలో 78 కుట్టు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. స్వయం సహాయక సంఘాలను ఆర్థికంగా బలోపేతం చేసేదిశగా వారికి అవకాశం కల్పించామని పేర్కొన్నారు. దుస్తుల తయారీ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ యశోద, సహాయ ప్రాజెక్టు మేనేజర్ భూమక్క తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వడదెబ్బ!



- భగభగమంటున్న భానుడు
- ఎండాకాలంలో పశువులు జాగ్రత్త

కౌటాల: వారం రోజుల నుంచి ఎండలు భగ్గుమంటున్నాయి. పలు ప్రాంతాల్లో 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉష్ణోగ్రత పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు ఎక్కువగా వడదెబ్బకు గురవుతాయి. గాలిప్రసరణ సరిగా లేకపోవడం, పశువులు షెడ్లలో ఎక్కువ సంఖ్యలో కిక్కిరిసి ఉండడం, పశవులకు నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం, వడగాలుల తాకిడి వడదెబ్బకు గురవుతాయి. తెల్లజాతి కంటే నల్లజాతి పశువులకు ఎక్కువగా వడదెబ్బకు గురైతాయి.

ప్రాణాంతకమే..

వేసవిలో పశువుల శరీర ఉష్ణోగ్రత కంటే ఎక్కువైనప్పుడు మెదడు హైపోథాలమస్ స్వేద గ్రంథులపై నియంత్రణ కోల్పోతుంది. దీంతో చర్మంపై గల స్వేద రంధ్రాలు చెమటను అధికంగా విడుదల చేసి శరీరంలోని ఎలక్ట్రోలైట్‌లను కోల్పోయి శరీర ప్రక్రియ మందగిస్తుంది. తద్వారా శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది. శ్వాస, గుండె, నాడివేగం పెరుగుతాయి. మూత్రపిండాలు సరిగా పనిచేయపోవడంతో మూత్ర విసర్జన కుంటుపడుతుంది. పశువుల ఆరోగ్య పరిస్థితి విషమించి అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి.

లక్షణాలు ఇలా..

పశువుల చర్మం సున్నితత్వం కోల్పోయి గట్టిపడుతుంది. పశువులు సరిగ్గా నడవలేక తూలుతూ పడుకోవడానికి ప్రయత్నిస్తాయి. నీడ కోసం చెట్ల కిందకు చేరుతాయి. ఫిట్స్ లక్షణాలతో క్రమంగా అపస్మారక స్థితిలోకి వెళ్లి మరణిస్తాయి. వడదెబ్బతో ప్రభావం వల్ల చూలు పశువుల్లో గర్భస్రావాలు సంభవిస్తాయి. పశువుల్లో పునరుత్పత్తి పక్రియ కుంటుపడుతుంది. పాల ఉత్పత్తి తగ్గుతుంది.

ముందస్తు జాగ్రత్తలు..

- పశువులను పగటి వేళ మేతకు వదలరాదు
- ఉదయం, సాయంత్రం వేళలో మాత్రమే బయటకు పంపాలి
- తాగునీరు అన్నివేళలా అందుబాటులో ఉంచాలి. పశువులను రోజుకు కనీసం రెండుసార్లు చల్లని నీళ్లలతో కడగాలి.
- గాలి వెలుతురు ప్రసారమయ్యేలా ఎత్తైనా కొట్టాం గడ్డితో నిర్మించాలి.
- పశువులకు గోమర్లు లేకుండా చూసుకోవాలి.

జాగ్రత్తలు పాటించాలి



పశువులను జాగ్రత్త కాపాడాలి. మధ్యాహ్నా సమయంలో పశువులను మేతకు బయటికి పంపొద్దు. తాగునీటి సదుపాయం అందుబాటులో ఉంచాలి. పశువులకు పచ్చిగడ్డి వేయాలి. పత్తి చేనుల్లో మేతకు వదలవద్దు. ఎండలో తిరిగితే పశువులకు ఎండదెబ్బ తగిలే అవకాశం ఉంది.

– శ్రీకాంత్, పశువైద్యాధికారి, కౌటాల

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



పట్టుకున్న ట్రాక్టర్లతో అధికారులు

కాగజ్‌నగర్ రూరల్: మండలంలోని జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టు సమీపంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేశారు. మైనింగ్ ఏడీ గంగాధర్‌రావు, ఇరిగేషన్ డీఈ తిరుపతి, కాగజ్‌నగర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఖాలిక్‌ల ఆధ్వర్యంలో దాడి చేసి మూడు ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ట్రాక్టర్లను కాగజ్‌నగర్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నాయకుడి మృతి

జైనూర్: మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు మెస్రం లక్ష్మణ్ బుధవారం గుండెపోటుతో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం మేజర్ గ్రామ పంచాయతీకి గత పది సంవత్సరాలుగా సర్పంచిగా బాధ్యతలు చేపట్టిన మెస్రం పార్వతీ భర్త బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లక్ష్మణ్‌కు మంగళవారం రాత్రి గుండె నొప్పి వచ్చింది. వెంటనే కుటుంబసభ్యులు ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. బుధవారం పరిస్థితి విషమించి మృతిచెందాడు.

ఆవిర్భావ వేడుకలు విజయవంతం చేయాలి

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి ఆధ్వర్యంలో జూన్ 2న బెల్లంపల్లి ఏరియాలో నిర్వహించే తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను గోలేటి, మాదారం టౌన్‌షిప్‌లోని ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు విజయవంతం చేయాలని ఏరియా యాజమాన్యం ఒక ప్రకటనలో కోరింది. ఆవిర్భావ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపింది. ఉదయం జీఎం కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు తెలంగాణ రన్, సాయంత్రం సీఈఆర్ క్లబ్‌లో స్టాల్స్ ఆవిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాలు, ఉత్తమ ఉద్యోగులు, ఉత్తమ సేవా సభ్యులకు సన్మాన కార్యక్రమాలతోపాటు చదువులో ప్రతిభ గల విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఏరియాలోని ప్రతిఒక్కరూ కుటుంబ సమేతంగా హాజరు కావాలని కోరారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి



కుట్టు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీఎం జగదీశ్వర్

కెరమెరి: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే యూనిఫాంల కుట్టులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఐకేపీ ఏపీఎం జగదీశ్వర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కొనసాగుతున్న కుట్టు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. టార్గెట్, అచీవ్‌మెంట్ గురించి అడిగి తెలుసుకున్నారు. జూన్ 6లోపు అన్ని యూనిఫాంలు తయారు అయ్యేలా చూడాలని కోరారు. ఆయన వెంట సీసీ శంకర్ ఉన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్అర్బన్: ఎస్సీ గురుకులాల సొసైటీ పరిధిలోని నాన్ సీవోఈ విద్యాలయాల్లో 2024-25 విద్యా సంవత్సరానికి జూనియర్ ఇంటర్‌లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గురుకుల కళాశాల, పాఠశాల ప్రిన్సిపాల్ ఊటూరి శ్రీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 24వ నుంచి 31 వరకు గురుకుల సొసైటీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉందని పేర్కొన్నారు.

చెరువే డంపింగ్‌యార్డు



రెబ్బెన: తడిపొడి చెత్తను తప్పనిసరిగా సెగ్రిగేషన్ షెడ్డుకు, డంపింగ్‌యార్డుకు తరలించాలని అధికారులు ఎంత చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. రెబ్బెన మండల కేంద్రంలోని చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించకుండా పులికుంట వాగులో డంప్ చేస్తున్నారు. అలా డంప్ చేసిన చెత్తకు నిప్పపెట్టి కాల్చివేస్తున్నారు. గత కొన్నినెలలుగా ఇదే తరహాలో చెత్తాచెదారాన్ని డంపింగ్‌యార్డులో కాకుండా వాగులోనే డంపింగ్ చేస్తుండడంతో గుట్టలు గుట్టలుగా పేరుకుపోయింది. వాగు సహజత్వం కోల్పోయి కలుషితంగా మారుతోంది.

నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి



అవగాహన కల్పిస్తున్న అధికారి చిరంజీవి

ఆసిఫాబాద్‌రూరల్: రైతులు నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయ విస్తరణ అధికారి చిరంజీవి అన్నారు. బుధవారం మండలంలోని చిర్రకుంట గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణం నుంచి రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని, విత్తన ప్యాకెట్, బిల్లును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎవరైనా లూజు విత్తనాలను విక్రయిస్తే వ్యవసాయాధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. అదే విధంగా మండలంలోని గోండుగుడా గ్రామంలో ఏఈవో సిడాం రాము, వాడిగొందిలో ఏఈవో గంట రాము, మోంగుబాయిగుడలో ఏఈవో రెహెమాన్‌లు రైతులకు అవగాహన కల్పించారు.

చిన్నారుల ఔదార్యం

- తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు సరుకులు అందజేత


సాక్షి ఎఫెక్ట్..



సరకులు అందిస్తున్న చిన్నారులు

కౌటాల: మండలంలోని పార్డీ గ్రామానికి చెందిన ముగ్గురు అనాథ పిల్లలకు బుధవారం కౌటాలకు చెందిన పలువురు చిన్నారులు నిత్యావసర సరుకులు అందజేశారు. క్వింటాల్ బియ్యం, పప్పులు, వంట నూనె, ఇతర సామగ్రి అందించి ఔదార్యం చాటారు. చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోవడం బాధకరమని వారు పేర్కొన్నారు. ప్యాకెట్ మనీతోపాటు తల్లిదండ్రుల సాయంతో పిల్లలకు సరుకులు అందించినట్లు తెలిపారు. కాగా.. మంగళవారం సాక్షి దినపత్రికలో 'ఆపన్నహస్తం కోసం ఎదురు చూపులు' అనే కథనానికి దాతలు స్పందించారు. కొంతమంది నగదు అందించగా.. మరికొందరు నేరుగా నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

పకడ్బందీగా రికార్డులు నిర్వహించాలి



రికార్డులు నమోదు చేస్తున్న అంజద్ పాషా

కెరమెరి: గ్రామ పంచాయతీ పంచాయతీ రికార్డులు పకడ్బందీగా నిర్వహించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో అంజద్ పాషా అన్నారు. బుధవారం మండలంలోని మెట్టపిప్రి, భోలాపాటర్, అంతాపూర్, బోరిలాల్‌గూడ గ్రామ పంచాయతీలను సందర్శించారు. పంచాయతీల్లోని రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.